# ఏమరుపాటు వద్దు

- పరిశీలించిన తర్వాతే నాణ్యమైన విత్తనాలు కొనాలి
- రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- తక్కువ ధరకు వస్తాయని కొంటే మోసపోయినట్లే..
- కృత్రిమ కొరత పేరుతో బ్రాండెడ్ సీడ్స్‌కు ఎక్కువ వసూళ్లు
- గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మొయినాబాద్, మే 26 : ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పొతం చేస్తున్నారు. విత్తనాలు విత్తేందుకు పెట్టుబడులు కూడా రెడీగా ఉంచుకున్నారు. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు వస్తాయని సకాలంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే రైతులు పత్తి, మక్కతో పాటు ఇతర విత్తనాలు విత్తడానికి సమాయత్తమవుతున్నారు. చాలా మంది రైతులు ఇప్పటి నుంచే తమకు కావాల్సిన కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పలువురు వ్యాపారులు ఆ విత్తనాల లభ్యత తక్కువగా ఉందంటూ ఎక్కువ మొత్తంలో వసూలు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇలాంటి వదంతులు వస్తున్న నేపథ్యంలో అధికారులు ముందుగానే అప్రమత్తమై చేవెళ్ల డివిజన్‌లోని వివిధ ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేయడం ప్రారంభించారు. ఆయా దుకాణాల్లో విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలని.. ఎక్కువ ధరకు ఎవరైనా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేస్తామంటున్నారు. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని విత్తన కంపెనీలకు చెందిన ప్రతినిధులు వ్యాపారులతో కుమ్మక్కై గ్రామాల్లో సంచరించే అవకాశం కూడా ఉందని వ్యవసాయ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. రైతులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా పెట్టిన పెట్టుబడి, పంట కాలం వృథా అయ్యే ప్రమాదం ఉన్నది.

### విత్తనాల ఎంపికే కీలకం

రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించకుంటే మొదటికే మోసం వస్తుంది. వర్షాలు ప్రారంభమైతే రైతులు హడాహుడిగా నగరానికి చేరుకుని షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు తక్కువ ధరకు నాణ్యత లేని విత్తనాలను విక్రయిస్తారు. కొరత ఉందనే ప్రచారం జరుగుతుండటంతో ఇప్పటికే చాలా మంది రైతులు ఆయా దుకాణాలకు చేరుకొని విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తన ఎంపికపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మకుండా ఉండేందుకు ఫెర్టిలైజర్ దుకాణాలను కూడా తరచుగా తనిఖీలు చేయాల్సిన అవసరం చాలా ఉన్నది. ఏదైనా మొలక శాతం రాక, పంట దిగుబడిలో ప్రతికూలత ఎదురైతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది, కాబట్టి రైతులు విత్తనాల నాణ్యతను పరిశీలించాలి. ప్రధానంగా చేవెళ్ల డివిజన్‌లో పత్తి, మక్క వంటి పంటల సాగు ఉంటుంది. రైతులకు ఈ విత్తనాలు నాణ్యమైనవి లభిస్తున్నాయా..? లేదా పరిశీలించాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపైనే ఉంటుందని రైతులు అంటున్నారు. రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

### రైతులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలంటే..

> లైసెన్స్‌లు ఉన్న అధీకృత దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి.

> తక్కువ ధరలకు వస్తున్నాయని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు.

> విత్తన ప్యాకెట్ల బస్తాలపై లాట్ నంబర్, కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ, లేబుల్ తదితర వివరాలు పరిశీలించాలి.

> విత్తన ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేస్తే వివరాలు చూసుకోవచ్చు.

> విత్తనాలు కొన్న సమయంలో తప్పనిసరిగా సంబంధిత దుకాణాల నుంచి రశీదు పొందాలి.

> రశీదును ఇంట్లో భద్రపరుచుకోవాలి, తద్వారా పంట నష్టపోయిన సమయంలో పరిహారం పొందే వీలుంటుంది.

> అవసరమైతే ముందుగా కొన్ని విత్తనాలు తీసుకుని మొలక శాతం పరీక్షించుకోవాలి.

> దుకాణాల్లో లేదా ప్రైవేట్‌గా నకిలీ విత్తనాలు అమ్మినట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

> లూజు బస్తాల్లో ఉండే విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదు.

> గ్రామాల్లోకి వచ్చే కంపెనీల ప్రతినిధుల నుంచి, గుర్తింపు లేని కంపెనీల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు.

### అధికారుల సూచనలు పాటించాలి



విత్తనాల ఎంపికలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. అప్రమత్తంగా ఉండి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి. తక్కువ ధరకు వస్తున్నాయని విత్తనాలను గుర్తింపు లేని కంపెనీల ప్రతినిధుల వద్ద కొనుగోలు చేయరాదు. లైసెన్స్‌లు ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. లూజుగా ఉన్న బస్తాల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తే మోసపోయే అవకాశం ఉంటుంది. లైసెన్సులు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. నాణ్యతలేని విత్తనాలు విక్రయించినవారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దుకాణాలను తనిఖీ చేస్తున్నాం. క్షేత్రస్థాయిలోకి వెళ్లి విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాలు కొనుగోలు చేసిన చోట తప్పకుండా రశీదు తీసుకోవాలి. వాటిని భద్రపరుచుకుంటే పంట నష్టపోయినప్పుడు పరిహారం వచ్చే అవకాశం ఉంటుంది.

**- రాగమ్మ, వ్యవసాయ అధికారి, మొయినాబాద్**

### సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ చెబుతున్నది. అదే విధంగా సన్న రకం వరికి బోనస్ కూడా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నది. గత ఏడాది ఖరీఫ్‌లో మొయినాబాద్ మండలంలో 17 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి 5500, పత్తి 900 ఎకరాల్లో సాగు చేయగా.. మిగిలిన విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేశారు. ఈ ఏడాది సకాలంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, భూగర్భజలాలు పెరగవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే గత ఏడాది కంటే మరో 1000 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగి 18 వేల ఎకరాల్లో పంటల సాగు ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరి 6500 ఎకరాల్లో సాగయ్యే అవకాశమున్నదని పేర్కొంటున్నారు. వర్షాలు అధికంగా ఉన్నాయని చెప్పడంతో పాటు సన్న రకం వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు వరిని ఎక్కువ సాగు చేయవచ్చని వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

### విత్తన ఎంపికపై రైతులకు అవగాహన సదస్సులు

విత్తనాల ఎంపికపై రైతులను అప్రమత్తం చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి వ్యవసాయ అధికారులు విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు(మే 25న) ఎన్కేపల్లి, నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నెల 27న చిలుకూరు, అప్పోజిగూడ, హిమాయత్‌నగర్, తోలుకట్టా, అప్పారెడ్డిగూడ, 28న రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చందానగర్, కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, సజ్జన్‌పల్లి, 29న మేడిపల్లి, చిన్నమంగళారం, కనకమామిడి, వెంకటాపూర్, 30న అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, ముర్తుజాగూడ, పెద్దమంగళారం, ఎల్కగూడ, 31న అమ్డాపూర్, కాశీంబౌలి, నజీబ్‌నగర్, శ్రీరాంనగర్, సురంగల్ గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సులు నిర్వహించడానికి వ్యవసాయ అధికారులు షెడ్యూల్ తయారు చేసుకున్నారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత

**కన్హాను సందర్శించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్**



కన్హా శాంతివనాన్ని సందర్శిస్తున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

నందిగామ, మే 26 : ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంలో ధ్యానం చేసి, కన్హాలోని నర్సరీలను, చెట్లను, ప్రపంచంలో అంతరించిపోతున్న వృక్ష జాతుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మోహన్ యాదవ్ మాట్లాడుతూ.. కన్హా శాంతివనాన్ని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని, పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని, ధ్యానం చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు. హార్ట్‌ఫుల్ నెస్ ద్వారా దాజీ చేస్తున్న సేవలు మరువలేనివని, మధ్యప్రదేశ్ ప్రభుత్వం హార్ట్‌ఫుల్ నెస్ సంస్థకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని 650 హెక్టార్ల భూమిలో అటవీ సంరక్షణ కోసం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

## ఆచార్య రవ్వా శ్రీహరి జీవనసాఫల్య పురస్కారాల ప్రదానం



ఆచార్య రవ్వా శ్రీహరి పేరిట నెలకొల్పిన జీవనసాఫల్య పురస్కారాన్ని ఆచార్య శలాక రఘునాథ శర్మకు ప్రదానం చేస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, మే 26 : ఆచార్య రవ్వా శ్రీహరి మహోన్నతమైన వ్యక్తి అని పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కొనియాడారు. ఆచార్య రవ్వా శ్రీహరి జీవనసాఫల్య పురస్కారాల ప్రధానోత్సవం ఆదివారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగింది. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంస్కృత పండితులు ఆచార్య శలాక రఘునాథ శర్మకు, ప్రముఖ భాషా పరిశోధకులు డాక్టర్ నలిమెల భాస్కర్‌కు పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.50 వేల నగదును ఆచార్య రవ్వా శ్రీహరి సతీమణి అనంతలక్ష్మి అందజేశారు. 10 మంది విద్యార్థులకు ఆచార్య రవ్వా శ్రీహరి యువ ప్రతిభ సంస్కృత నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ వెలిచాల కొండల్‌రావు, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీరంగాచార్య, ఆచార్య ఎ.రాములు, ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, డాక్టర్ అప్పం పాండయ్య, ప్రముఖ సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, కె.రామచంద్రమూర్తి తదితరులు పాల్గొని ఆచార్య రవ్వా శ్రీహరి తెలుగు, సంస్కృతం, తెలంగాణ మాండలిక నిఘంటువు నిర్మాణానికి చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ఆచార్య రవ్వా శ్రీహరి రచించిన ఆంధ్రపద నిదానం పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు.



తుర్కయాంజాల్‌లోని బీ మార్ట్‌లో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ పోలీసులు

## బీ మార్ట్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

తుర్కయాంజాల్, మే 26 : వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్ట్‌లలో సరైన జాగ్రత్తలు పాటించాలని ఇబ్రహీంపట్నం డివిజన్ రాచకొండ బాంబ్ స్క్వాడ్ బృందం తెలిపింది. ఆదివారం సాధారణ తనిఖీల్లో భాగంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బీ మార్ట్ సూపర్ మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ మార్కెట్‌లో సీసీ కెమెరాలతో పాటు రక్షణ చర్యలను పరిశీలించారు. తనిఖీల్లో ఏఆర్ ఎస్ఐ నందు, హెడ్ కానిస్టేబుళ్లు సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

## 29న మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు

షాబాద్, మే 26 : రంగారెడ్డిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 29న ఆరు సంవత్సరాలు పైబడిన బాల-బాలికలకు అండర్-8 ఇయర్స్, 10, 12, 14, 16, 18, 20 ఇయర్స్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 8 గంటలకు పుట్టినతేది ధ్రువపత్రంతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు రంగారెడ్డిజిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పాన సాయిరెడ్డిని 9703838987లో సంప్రదించాలని ఆయన కోరారు.

## విద్యుత్ హైటెన్షన్ టవర్లను మార్చేశాం

**- జిల్లా అటవీ శాఖ అధికారి వివరణ**

**- నమస్తే కథనానికి స్పందన**

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ) : చిలుకూరు మృగవని జాతీయ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ పోల్స్ దూరంగా ఏర్పాటు చేశామని, దీనివల్ల పార్కులోని జంతువులు, పక్షులకు హాని జరగడం లేదని రంగారెడ్డి జిల్లా అటవీ అధికారి పేర్కొన్నారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'అంతమవుతున్న అటవీ ప్రాంతం - ప్రమాదకరంగా హైటెన్షన్ వైర్లు 'అనే కథనంతో ప్రచురితమైన వార్తకు అటవీ శాఖ వివరణ ఇచ్చింది. ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్-1980 ద్వారా అనుమతులు ఇచ్చామని, దానికి అనుగుణంగానే హైటెన్షన్ విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా చిల్కూరు రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం విస్తీర్ణం 490 హెక్టార్లు ఉండగా, 700 ఎకరాలలో ఉన్న జింకల పార్కును జాతీయ పార్కుగా 1998లో ప్రకటించినట్లు తెలిపారు. అప్పుడు పొరపాటున 280.29 హెకార్టు రాసే బదులు 360 హెక్టార్లుగా రాశారని, దీనికి సంబంధించి డీజీపీఎస్ సర్వే చేసి జాతీయ పార్కు విస్తీర్ణం 280.29 హెక్టార్లుగా నిర్ధారిస్తూ ప్రభుత్వానికి గెజిట్ నోటిఫికేషన్‌లో ఉన్న విస్తీర్ణాన్ని సవరించాల్సిందిగా ప్రతిపాదన పంపించామని పేర్కొన్నారు. జాతీయ పార్కును అనుకొని ఉన్న నార్సింగి, మంచిరేవుల పాతరోడ్డును వాడడం లేదని, అదేవిధంగా జాతీయ పార్కును నర్సరీ, ఓఆర్ఆర్ డైవర్షన్ అయిన విస్తీర్ణంలో పోగా మిగిలిన చిల్కూరు రిజర్వు పారెస్ట్ ప్రాంతంలో కొత్తగా ట్రెక్ పార్కును టీజీఎఫ్‌డీసీ ద్వారా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వివరణ ఇచ్చారు.

## శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్, మే 26 : శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ రజతోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో ఆదివారం సంఘం అధ్యక్షుడు తిరువేంగళాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరై జూలై 20న నిర్వహించనున్న రజతోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు, బంధువులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కండ్లకుంట యాదగిరి చార్యులు, ప్రధానకార్యదర్శి సేనాపతి మోహన్, సభ్యులు శ్రీనివాసాచార్యులు, రత్నకుమార్, కృష్ణమాచారి, మాధవాచార్యులు, ఆచార్య వేణు తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు, విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రాలిన మామిడికాయలు, తడిసిన ధాన్యం
- చెల్లాచెదురైన రేకుల షెడ్లు



తుర్కయాంజాల్ : లక్ష్మి మెగా టౌన్‌షిప్ కాలనీలో కూలిన చెట్టు

తుర్కయాంజాల్, మే 26 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం బీభత్సం సృష్టించింది. పలు చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. 5 చోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోగా.. 14 చోట్ల పెద్ద చెట్లు విద్యుత్ తీగలపై పడడంతో మున్సిపాలిటీ పరిధిలో 3గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు కాలనీల్లో చెట్లు కూలి పలువురి కార్లు, ద్విచక్ర వాహనాలపై పడడంతో వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్‌లో సంరెడ్డి వెంకట్‌రెడ్డికి చెందిన మామిడి తోటలో ఈదురుగాలులకు కోతకు వచ్చిన మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. మార్కెట్లో రాలిన కాయలకు ధర రాదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

### విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

బొంరాస్‌పేట : బొంరాస్‌పేట, పోలేపల్లి గ్రామాల్లో రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. ఎల్లమ్మ ఆలయం ధ్వజస్తంభంపై కొద్దిభాగం గాలికి విరిగిపోయింది. ఆలయం సమీపంలో బేగరి శ్యాంకు చెందిన రేకుల దుకాణం చెల్లాచెదురైంది. తుంకిమెట్ల గ్రామంలో ఆటో డ్రైవర్ బేగరి శివ ఇంటిపై చెట్టు విరిగిపడడంతో ఇంటికి నష్టం వాటిల్లింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం జరుగలేదు. లక్ష రూపాయల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. బాధితుడికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడిన కారణంగా బొంరాస్‌పేట సబ్ స్టేషన్ పరిధిలో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

### పెద్దఅంబర్‌పేట మండల పరిధిలో..

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీతోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గౌరెల్లి, తారామతిపేట, కుత్బుల్లాపూర్ గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మున్సిపాలిటీ పరిధి రావి నారాయణరెడ్డి కాలనీలోని పలు ఇండ్ల రేకులు ఎగిరిపడ్డాయి.



పెద్దఅంబర్‌పేట : గౌరెల్లి- నాగోల్ రోడ్డులో కూలిన చెట్టు

### పిడుగుపాటుకు ఆవు మృతి

పరిగి : పరిగి మండలంలోని ఇబ్రహీంపూర్, గడిసింగాపూర్, రంగంపల్లితోపాటు పరిగి పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పరిగి మండలం రూప్‌సింగ్‌తండాలో పిడుగుపాటుకు రాములునాయక్‌కు చెందిన ఒక ఆవు మృతి చెందింది. సర్కారు తమను ఆదుకొని సహాయం చేయాలని రాములునాయక్ కోరారు. ఇబ్రహీంపూర్ పరిసర ప్రాంతాల్లో చెట్లు విరిగి నేలకూలాయి. ఇబ్రహీంపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. అక్కడక్కడ మామిడికాయలు రాలిపోయాయి.

### తెగిన విద్యుత్ వైర్లు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అనేక చోట్ల చెట్లు విరిగాయి. విద్యుత్ వైర్లు తెగాయి. మంగల్‌పల్లి గ్రామంలో పలువురు వడ్డెర కులస్తులు వేసుకున్న గుడిసెలు గాలివానకు ఎగిరిపోయాయి. పలువురికి గాయాలయ్యాయి. నాగన్‌పల్లి గ్రామంలో వడ్డెర కులస్తుల గుడిసెలు చెల్లాచెదురు కాగా వారికి నిలువ నీడ లేకుండా పోయింది. పలు గ్రామాల్లో మామిడికాయలు పూర్తిగా నేలరాలి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లు కూడా తడిసి ముద్దయ్యాయి.

### ఎండ నుంచి ఉపశమనం

దోమ : దోమ మండల పరిధిలోని బడెంపల్లి, కొండాయపల్లి, దిర్సంపల్లి, అయినాపూర్, పాలేపల్లి తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ఎండ నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.

### కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో..

కులకచర్ల : కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో చెట్లు గాలికి విరిగి రోడ్డుపై పడటంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ముజాహిద్‌పూర్‌లో రోడ్డుపై చెట్లు, చౌడాపూర్‌లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



పరిగి : పిడుగుపాటుకు మృతిచెందిన ఆవు



ఇబ్రహీంపట్నం : నాగన్‌పల్లి సమీపంలో ఎగిరిపోయిన గుడిసె పైకప్పు

### దంచికొట్టిన వాన

ధారూరు : ధారూరు మండల పరిధిలోని నాగారం, ధారూరు, మైలారం, కుమ్మరిపల్లి, గురుదోట్ల, దోర్నాల్, అల్లీపూర్, తరిగోపుల, రాజాపూర్, మోమిన్‌ఖుర్దు, గట్టేపల్లి, అవుసుపల్లి, చింతకుంట, అంతారం తదితర గ్రామాల్లో వాన దంచికొట్టింది. నాగారం గ్రామంలో చెట్లు విరిగి గోడలు, రోడ్డుపై పడ్డాయి. విద్యుత్ స్తంభాలు కిందపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. మైలారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని చెట్లు విరిగి ప్రహరీపై పడింది. మైలారం ముందలితండాలోరేకులు ఎగిరిపోయాయి. అల్లీపూర్ గ్రామ సమీపంలో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. మోమిన్‌ఖుర్దు గ్రామంలో రేకులు ఎగిరిపోయాయి. చెట్లు విరిగి ఇండ్లపై పడ్డాయి. కొన్ని గ్రామాల్లో పంట పొలాలు నీటితో నిండిపోయాయి.

### విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద చెట్లు నేలకూలాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వృక్షాలు విద్యుత్ వైర్లపై పడడంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది పరిస్థితిని సమీక్షించి చెట్లను తొలగించి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



బొంరాస్‌పేట : పోలేపల్లిలో గాలులకు చెల్లాచెదురైన రేకుల దుకాణం



అబ్దుల్లాపూర్‌మెట్ : జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ప్రభుత్వ పాఠశాలపై కూలిన చెట్టు



కులకచర్ల : ముజాహిద్‌పూర్‌లో గాలికి రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు



ధారూరు : నాగారం గ్రామంలో ఈదురు గాలులకు విరిగిపడ్డ విద్యుత్ స్తంభం